ప్రజాశక్తి

శనివారం 1 జూన్ 2024 · 8 పేజీలు

గుంటూరు · పల్నాడు

ఫైడే..

వడదెబ్బకి ముగ్గురు మృతి - 15 మండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేసవి తీవ్రత గణనీయంగా పెరిగింది. శుక్రవారం పలు ప్రాంతాల్లో వేసవి తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉడికిపోతున్నారు. రోహిణీ కార్తె ప్రభావంతో గతమూడు రోజులుగా ఉష్ణోగ్రతలు, వేడిగాలులు పెరిగాయి. వడగాలులు కూడా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోతతో ప్రజలు విలవిలలాడి పోతున్నారు.ఎప్పుడూ లేని విధంగా గుంటూరు జిల్లాలోని ఐదు మండలాలు, పల్నాడు జిల్లాలోని 10 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వినుకొండలో గరిష్టంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. గుంటూరు, చిలకలూరిపేట ప్రాంతంలో వడగాల్పులకు గత 24 గంటల్లో ముగ్గురు అభాగ్యులు మృతి చెందారు. ఒంటరీ జీవనం సాగిస్తున్న ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. వీరంతా ఎండ తీవ్రతకు నిస్సత్తువతో ప్రాణాలు కోల్పోయారు.వేసవిలో అభాగ్యులకు షెల్టర్లు ఏర్పాటు కాలేదు. వేసవి తీవ్రతకు ప్రభుత్వం ఈ సారి ఎటువంటి ముందస్తు ఏర్పాట్లు చేయలేదు.దీంతో అభాగ్యులు, అస్వస్థతకు గురి అయిన తరువాత ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుపక్కన పడి ఎండతీవ్రత తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేడిగాలుల తీవ్రత కొనసాగు తోంది. అర్ధరాత్రి దాటిన తరువాత మాత్రమే కొంత మేరకు వేడిగాలులు తగ్గుతున్నాయి. ఏసీ సౌకర్యం లేని వారికి అర్ధరాత్రి వరకు నిద్రపట్టని పరిస్థితి నెలకొంది. వృద్దులు, మహిళలు, చిన్నారులు వేసవి తీవ్రత తట్టుకోలేకపోతున్నారు. ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉదయం నుంచే వడగాల్పులు వీస్తుండటంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, ఏసీలు ఎక్కువగా వాడుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. వేసవి తాపం నుంచి బయటపడేందుకు ప్రజలు సాయంత్రం కాగానే

2 లో

మాచర్లలో

మండలాల వారీగా నమోదు అయిన అధిక ఉష్ణోగ్రతలు

వినుకొండ 45.9	మంగళగిరి 43.1
అచ్చంపేట 45.6	మేడికొండూరు 43.6
క్రోసూరు 45.6	పెదకాకాని 43.6
మాచర్ల 45.5	తెనాలి 43
కాకుమాను 45.5	వట్టిచెరకూరు 42.3
నాదెండ్ల 45.2	అమరావతి 44
బొల్లాపల్లి 45	బెల్లంకొండ 44.1
తుళ్లూరు 45	దుర్గి 42.5
ముప్పాళ్ల 45	గురజాల 42.9
ఫిరంగిపురం 45	ఈపూరు 42.4
దాచేపల్లి 44.7	కారంపూడి 43.7
చిలకలూరిపేట 44.7	మాచవరం 44.4
యడ్లపాడు 44.7	గుంటూరు : 43.6
పెదనందిపాడు 44.8	దుగ్గిరాల : 43.6

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

పల్నాడు జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తేవాలని, పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్ లో రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన సమావేశంలో కృష్ణయ్య ప్రసంగించారు. నాగార్జునసాగర్ కాలువల మరమ్మతులు చేపట్టి, పూడికలు తీయించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. పచ్చరొట్టె విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో జీరో వడ్డీ రుణ పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలని , పావలా వడ్డీ రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని అన్ని బ్యాంకులు ఖచ్చితంగా అమలు జరిపేలా చూడాలని, గత సంవత్సరం నవంబర్ డిసెంబర్ నెలలో వచ్చిన తుపానుకు పంటలు నష్టపోయిన వారికి ఇప్పటివరకు పరిహారం అందజేయలేదని వెంటనే వారికి పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సంబంధించిన అనేక ప్రభుత్వ పథకాలను నిలిపివేశారని వాటిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగు తున్నాయని దీనివలన రైతుల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని ప్రభుత్వం వెంటనే నకిలీ విత్తనాలను అరికట్టాలని ఆయన తెలిపారు. రైతు సంఘం నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన విధంగా ఆర్ బికెల ద్వారా

2 లో

విత్తన దుకాణలపై విజిలెన్సు దాడులు

పత్తి,మిర్చి విత్తనాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని పలు విత్తన దుకాణాలపై శుక్రవారం విజిలెన్సు అధికారులు దాడులు నిర్వహించారు. గుంటూరు నగరం రాజగారి తోటలోని విత్తన షాపులలో అధిక డిమాండ్ ఉన్న ప్రత్తి, మిర్చి విత్తనాలను అక్రమంగా నిల్వ చేసి, కతిమ కొరత సష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని వచ్చిన సమాచారంతో కుబేరా సీడ్స్,పెస్టిసైడ్స్ దుకాణంకు ఒక కానిస్టేబుల్‌ను రైతు అవతారంలో పంపారు. పోల్ రాజు అనే హెడ్ కానిస్టేబుల్ ను రైతు వలె పంపి ప్రస్తుతం మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న 3 రకాల ప్రత్తి, మిర్చి విత్తనాలు సూపర్ బంటి, రేవంత్,యుఎస్ 7067 ను రకాలు ఉన్నాయా అని అడగ్గా అని అడుగగా, షాపు వారు ఆ స్టాక్ లేవని చెప్పారు. అయితే నిల్వలు ఉన్నాయి. దీంతో విజిలెన్సు అధికారులు దాడి చేశారు. "రేవంత్" రకం విత్తనాలు 18 పాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15,552గా అధికారులు తెలిపారు. "బాలాజీ సీడ్స్" షాపు లో "సోర్సు సర్టిఫికేట్" లేకుండా విక్రయాలు చేస్తుండగా రూ. 37,500 హైబ్రీడ్ మిరప విత్తనాల ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీ రామా సీడ్స్ షాపు లో "సోర్సు సర్టిఫికేట్" లేకుండా ఆమ్ముచున్న 200 పాకెట్స్ హైబ్రీడ్ మిరప విత్తనాల విలువ రూ. 1,63,500ల విలువైన విత్తనాలు స్వాధీనం చేసుకుని సంబంధిత సరుకు అమ్మకుండా నిలుపదల చేశారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ వ్యవసాయ అధికారి రమణ కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, స్థానిక వ్యవసాయ అధికారి అంజి రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సుల కలకలం

జిఎంసి నుంచి బయటకు వెళ్లిన వైనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం 11.30 గంటల ప్రాంతంలో ఒక వాహనంలో నాలుగు బాక్సులు (డ్రమ్ము) బయటకు వచ్చిన ఘటన కలకలం రేపింది. గుంటూరులో పోస్టల్ బ్యాలెట్‌కు వినియోగించిన డబ్బాలను నగర పాలక సంస్థ ఆక్రమణ నిర్మూలన దళం వాహనంలో తీసుకువెళ్లారు. ఈ బాక్సులపై పోస్టల్ బ్యాలెట్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అని ఉంది. ఈ వాహనంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక బాక్సు మూత తెరచి ఉంది. ఈ బాక్సులకు ఎటువంటి సీల్ లేదు. వీటిని ఎక్కడికి తీసుకువెళ్తున్నారు. ఎవరు తీసుకువెళ్తున్నారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. సాధారణ బాక్సులు అయితే కార్పొరేషన్ వాహనంలో ఎందుకు తీసుకువెళ్తారు.? బాక్సులపై పోస్టల్ బ్యాలెట్ పశ్చిమ నియోజకవర్గం అని ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోలయిన బాక్సులు స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎలా బయటకు తెచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఏ బాక్సు బయటకు తేవాలన్నా తగిన పోలీసు భద్రత, అధికారులు వెంట ఉండాలి. కానీ సాధారణ ఉద్యోగులతో బాక్సులు ఎలా బయటకు తెచ్చారు. వినియోగించగా మిగిలిపోయిన వాటిపై పోస్టల్ బ్యాలెట్ స్టిక్కర్లు ఎందుకు ఉన్నాయి? అనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. వీటిపై టిడిపి వర్గాలు మండిపడుతున్నాయి.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలుకే : పల్నాడు ఎస్‌పి

పల్నాడు జిల్లాలో నేటి సాయంత్రం 5గంటల నుండి 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రానున్న ఎన్నికల ఫలితాల సందర్భంగా సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వీడియోలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు ఎస్పీ మల్లిక గర్గ్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తి మరొక వ్యక్తిని సోషల్ మీడియాలో అసభ్యకరంగా తిడుతూ, రాజకీయ పార్టీల గురించి ప్రస్తావిస్తూ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడి వీడియో పోస్ట్ చేశారన్న ఫిర్యాదు నేపథ్యంలో దర్యాప్తు చేసి సదరు వ్యక్తిని జైలుకు పంపడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలలో ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు, వీడియోలు పోస్టు చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా నేరాలలో గ్రూప్ అడ్మిన్ లదే పూర్తి భాద్యత వహించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియా లేదా వాట్సాప్‌లలో రాబోవు ఎగ్జిట్ పోల్స్ తరువాత ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని ఎవరైనా అటువంటి సందేశాలు, ఫోటోలు, వీడియోలు పంపిన యెడల గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ ఒక రాజకీయ పార్టీ ఆఫీసు వాచ్‌మెన్ పై దాడి చేసి పార్టీ కార్యాలయం తగుల పెడతానని బెదిరించిన విషయమై అతనిపై కేసు నమోదు చేసి అతనిని జైలుకు

2 లో

మాట్లాడుతున్న ఎస్‌పి మల్లికా గార్గ్

చంద్రబాబును కలిసిన కన్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని హైదరాబాద్ లో ఆయన నివాసంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ..త్వరలో ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న దార్శనికులు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశానని పేర్కొన్నారు.

ఫ్రై డే..

(మొదటిపేజీ తరువాయి)

శీతలపానియాలు, జ్యూస్ దుకాణాలు, ఐస్ క్రీం పార్లర్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి తాపంతో వృద్ధులు రోజుకు నాలుగుసార్లు వరకు స్నానం చేయాల్సివస్తోందని వాపోతున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో మధ్యాహ్న సమయంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయిఒ. వేసవి తీవ్రతకు తాగునీటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేసవి తీవ్రతకు ఆరుబయటపెట్టిన వాహనాలను దెబ్బతింటున్నాయి. కొన్ని వాహనాలు టైర్లు దెబ్బతింటుండగా కొన్నింటిలో మంటలు వస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని 18 మండలాలు, పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో 42 డిగ్రీలపైనే ఉష్ణోగ్రత లు నమోదు అయ్యాయి.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే జైలుకే : పల్నాడు ఎస్పి

(మొదటిపేజీ తరువాయి)

పంపామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎలాంటి వారిపైన అయినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని వారిపై పిడి యాక్ట్ పెట్టడం అవరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా నేటి (శనివారం) నుండి 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో హనుమాన్ జయంతి సంద ర్భంగా ఎటువంటి ర్యాలీలు, మైకులకు, సాంస్కృతిక కార్యక్ర మాలకు అనుమతి లేదని, ప్రజలు ఆలయాలలో మాత్రమే పూజలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున 5 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని వాణిజ్య, వ్యాపార కార్యక్రమాలను (షాపులు) మూసివేయాలన్నారు. వ్యాపారస్తులు పోలీసు వారికి సహ కరించాలని కోరారు. ప్రజలు కూడా ఎక్కడ గుమి కూడరాదని ఏదైనా అత్యవసరమైతేనే బయటికి రావాలని కావాల్సిన సరుకులను ఇతర వస్తువులను శనివారం సాయంత్రం లోగా తీసుకొని, బయటకు రాకుండా ఇంట్లోనే ఉండి పోలీసు వారికి శాంతి భద్రతల విషయంలో సహకరించాలన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4 న జరగనున్న నేపథ్యంలో వివాదాలు అరికట్టేందుకు పోలీసు శాఖ చేపట్టిన భద్రత చర్యలలో భాగంగా రొంపిచర్ల మండలంలో పల్నాడు జిల్లా ఎస్.పి మలిక గర్గ్ ఆదేశాల మేరకు నేటి (అనగా శనివారం) సాయంత్రం 5 గంటల నుండి 4వ తేదీ వరకు రొంపిచర్ల మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రొంపిచర్ల ఎస్.ఐ కె.రవీంద్ర పాల్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శనివారం సాయంత్రం నుండి దుకాణాలు మూసివేయడం జరుగుతుందని ప్రజలు తమకు అవసరమైన నిత్యావసర వస్తువులను ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలలో పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

పాలీసెట్‌కు కౌన్సెలింగ్‌కు 246 మంది హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం 59001 నుండి 75000 ర్యాంకుల వరకూ కౌన్సెలింగ్ నిర్వహించగా నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజిలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో 246 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. నేడు 75001 నుండి 92000 ర్యాంకుల వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

నిప్పులు చెరుగుతున్న భానుడు

విలవిల్లాడుతున్న వృద్ధులు, పిల్లలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. రోహిణి కార్తె ఆరంభమైన 5 రోజుల నుండి సూర్యుడు ఉగ్రరూపం దాల్చాడు.ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోవడంతో పాటు వేడి గాలులు వీస్తున్నాయి. రాత్రి 8 గంటలకు కూడా వాతావరణంలో వేడిమి తగ్గడం లేదు. రాత్రి పూట కూడా ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదౌతున్నాయి. మరో వారం రోజుల్లో నైరుతి రుతుపవనాలొస్తే వాతావరణం చల్లబడుతుందని ఆశిస్తున్న తరుణంలో ఆకస్మాత్తుగా ఉష్ణోగ్రతలు, వడ గాడ్పులు పెరగడంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి. మరో నాలుగు రోజులు వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. అత్యవసరమైతేనే తప్ప ఇళ్ళనుంచి బయటకు రావాలని సూచించారు. అప్పుడు కూడా గొడుగు నీడలో రావాలని కాటన్ దుస్తులు ధరించాలని అలాగే చెవుల్లోకి గాలి వెళ్ళకుండా చూసు కోవాలన్నారు. దాహం వేయకపోయినా తరచూ నీరుత్రాగాలన్నారు. నిమ్మరసం, ఎలక్ట్రాల్ పౌడర్లు, ఒఆర్ఎస్,కొబ్బరిబొండాలు తరచూ తీసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

జూన్ మొదటి వారంలో భారీ వర్ష సూచన

జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ అధికారులు స్పష్టం చేశారు. నైరుతి రుతుపవనాలు జూన్ 3 లేదా 4వ తేదీ నాటికి జిల్లాకు చేరుకుంటాయని అంచనాలు వేస్తున్నారు. మొదట తేలికపాటి జల్లులు కురిసినా రానురాను భారీ వర్షాలు నమోదౌతాయని ఇటీవల నివేదికలు విడుదల చేశారు.ఈ ఏడాది సగటు వర్షపాతం కంటే షుమారు 5 శాతం అధికంగా వర్షాలు పడే అవకాశాలున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. అయితే ఈ వర్షపాతం కేవలం కొద్ది రోజుల్లోనే భారీ వర్షంగా నమోదవుతుందన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల : రోహిణి కార్తె ప్రారంభం నుండి భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడ అన్నట్లు ఎండ వేడి మండిపోతుంది. గత 3రోజుల నుండి అత్యధిక ఉష్టోగ్రతతో కాస్తున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటలకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పురపాలక శాఖ అధికారులు ఎండ వేడి నుండి తట్టుకునేందుకు పట్టణ ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన చలువ పందిరి వాహనాలు నిలపుకునేందుకు ఉపయోగిస్తుండటంతో, అది ప్రజలకు ఉపయోగకరంగా లేకుండా పోయింది. పలు అవసరాల నిమిత్తం గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చిన వారు కొద్ది సేవు సేద తీరేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏర్పాటు చేసిన చలివేంద్రాల సంఖ్య కూడ తక్కువగా ఉండటంతో త్రాగునీరు కొనుగోలు చేసి త్రాగాల్సిన పరిస్థితులున్నాయి. పురపాలక శాఖ అధికారులు ఎండ వేడి నుండి వాతావారణాన్ని చల్లబర్చేందుకు ట్యాంకర్లతో రహదార్లపై ఉదయం, సాయంత్రం నీరు చల్లించే పనులు చేయాలని, చలివేంద్రాల సంఖ్య కూడ పెంచాలని ఎండ బారి నుండి ప్రజలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కౌంటింగ్ ప్రక్రియ విజయవంతమే లక్ష్యం

పల్నాడు జిల్లా ఎస్పీ మల్గికా గార్గ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌంటింగ్ సెంటర్ వద్ద జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు,అల్లర్లు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేయడమే లక్ష్యమని పల్నాడు జిల్లా ఎస్పీ మల్గికా గార్గ్ అన్నారు.

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించనున్న రెవిన్యూ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు , జిల్లా పోలీసు అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులున్నా పోలీసులకు తెలియజేయాలని కౌంటింగ్ సిబ్బందికి రెవెన్యూ ఆఫీసర్లకు పోలీసులు అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

జిల్లాలో కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన ఇతర జిల్లాల పోలీసు అధికారులు, రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాల అధికారులు, అక్టోపస్ కమాండోస్, సాయుధ బలగాల అధికారులతో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అన్ని విషయాలను ప్రస్తుత రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా వివరించారు. కొత్తగా బయట జిల్లాల నుంచి వచ్చిన అధికారులు విధులు నిర్వహించబోయే మండలం, గ్రామం యొక్క జియోగ్రాఫికల్ మ్యాప్ ను, అదేవిధంగా ఆ మండలంలో ఎన్నికల సమయంలో జరిగిన నేరాలకు సంబంధించిన వివరాలను, ఆ కేసులలో ఉన్న ముద్దాయిల వివరాలు, అరెస్టయిన వారి వివరాలు, అరెస్టు కావాల్సిన వారి వివరాలు, బైండవర్ అయ్యారా లేదా, ట్రబుల్ మంగార్స్, రౌడీ షీటర్ల యొక్క వివరాలు పరిస్థితి వెంటనే తెలుసుకునేందుకు ప్రచురించిన పుస్తకాన్ని అందజేశారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున నేటి (శనివారం) సాయంత్రం 5 గంటల నుండి 5 వ తేదీ వరకు అన్ని దుకాణాలు మూసి వేయడం జరుగుతుందన్నారు. గుమి కూడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. అదేవిధంగా శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ అనంతరం రోడ్లపై ప్రజలు గుమి కూడరాదని, పార్టీ కార్యాలయాలలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉండొద్దన్నారు. ఆయా పార్టీల కార్యాలయాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రౌడీషీటర్ లను ,ట్రబుల్ మంగార్స్ ను స్టేషన్కు పిలిపించి కౌన్సి లింగ్ ఇవ్వాలని ఆదేశించారు. . సమ స్యాత్మక గ్రామాలలో అల్లరి మూకల కదలికలను గుర్తించుటకు డ్రోన్లను కూడా ఉపయోగించనున్నట్లు చెప్పారు. పిడుగు రాళ్ల, దాచేపల్లి పోలీస్ స్టేషన్లను సందర్శించి మాట్లాడారు. ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని కలిగిస్తూ సుమారు 500మంది సాయుద బలగాలతో పిడుగురాళ్ల,దాచేపల్లిలో ఏర్పాటు చేసిన మెగా ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్నారు. ఆయా పట్టణాలలో ఏర్పాటు చేసిన సభలలో మాట్లాడారు.

సత్తెనపల్లిలో ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

పోలీసులు వాహనాలు తనిఖీ లు చేపట్టారు. సత్తెనపల్లి పట్టణంలో పోలీసులు ఆకస్మికంగా శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ లు నిర్వహించారు. ఎలాంటి దపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఆటోలు కార్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, సంధ్యారాణి పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు ఉప యోగం చేకూరలేదని అన్నారు. ఇప్పటికైనా ఆర్ బికెల ద్వారా మిచౌ తుపాన్ వలన పంట నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏవిఎన్ గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో గత సంవత్సరం సాగునీరు అందక లక్ష ఎకరాలు పడావుగా పడి ఉన్నదని ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, వ్యవసాయ కార్మికులకు పనులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగునీరు ప్రణాళికను వ్యవసాయ ప్రణాళికను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికై రైతులంతా ఐక్యంగా సంఘటిత మవ్వాలన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రావెళ్ళ వెంకటేశ్వర్లు, కల్లూరు రామారావు, ఏ శ్రీనివాసరెడ్డి, మక్కపాటి నరసింహారావు, ముని వెంకటేశ్వర్లు, బుంగ నాగేశ్వరరావు, చెదలవాడ లక్ష్మీనారాయణ, అత్తోట అప్పారావు, నరసిం హరెడ్డి, బండారుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంత పల్నాడే మా లక్ష్యం

- పల్నాడు ప్రశాంతంగా మారిందని చూపిద్దాం
- కౌంటింగ్ రోజున ప్రజలు బయటకు రావొద్దు
- నేటి సాయంత్రం నుండి దుకాణాలు మూసివేయాలి : ఎస్పీ మల్లికా గార్గే

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

ప్రశాంతమైన పల్నాడు మా లక్ష్యం అని పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గే అన్నారు. శుక్రవారం పట్టణంలో 500 మంది సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు ప్రాంతంలో జరిగిన రాజకీయ గొడవల వల్ల ఈ జిల్లా దేశవ్యాప్తంగా తెలిసిందని అన్నారు .జూన్ 4న నిర్వహించే కౌటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేం దుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రశాంతమైన పల్నాడును ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు కనుక కౌం టింగ్ రోజున బయట తిరగకుండా ఇంట్లోనే ఉండాలని సూచిం చారు. పల్నాడు ప్రశాంతంగా మారినట్లు దేశ వ్యాప్తంగా చూపించాలన్నారు. ఎన్నికల రోజున జరిగిన గొడవల వలన చాలా మంది జీవితాలు నాశనమయ్యాయని, చాలా మంది జైళ్ళ పాలయ్యారని, మన జిల్లాలో సరిపోక రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని జైళ్ళకు కూడా పంపిచాల్సిన పరిస్ధితి వచ్చిందని అన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి గొడవల్లో పాల్గొన్న వారిపై కేసులు నమోదయ్యాయని, భవిష్యత్‌లో ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు వెళ్ళేందుకు వారిక వీసాలు రాకా అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. ఇకపై ఎవరైన గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎవరి ఇళ్ళలోనైన రాడ్లు,కర్రలు, బాంబులు, పెట్రోల్ బాటిళ్ళు ఉన్నట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూన్1వ తేది సాయంత్రం నుండి దుకాణాలు మూసి వేయాలని 5వ తేది వరకు దుకాణాలు తెరవకూడదని పోలీసులు చెప్పిన తరవాతే దుకణాలు తెరవాలని తెలిపారు.ఎన్నికల ఫలితాల రోజు బాణ సంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం చేయకూడదని తెలిపారు. పోలీసుల విధి నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఎవరైన గొడవలు పడితే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు గొడవలపై ఆవగాహన కల్పించాలని తెలిపారు.విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటా మని తెలిపారు.

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న తెనాలి టూ టౌన్ సిఐ సుధాకర్

కార్డన్ సర్చ్ .. పది వాహనాలు సీజ్

ప్రజాశక్తి-తెనాలి

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు పూర్తయ్యే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 2 టౌన్ సిఐ ఎ సుధాకర్ అన్నారు. స్థానిక బిసి కాలనీలో శుక్రువారం ఫ్లాగ్ మార్చ్ చేస్తూ కార్డెన్ సెర్చ్ నిర్వ హించారు. బహుళ అంతస్తుల నిర్మాణాల్లో కూడా ద్విచక్ర వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 10 వాహనాలను సీజ్ చేసి రవాణా శాఖ కార్యాలయానికి తరలించినట్లు సిఐ సుధాకర్ వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరుపుకోవాలని స్థానికులకు తెలియపరిచారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు.

పొన్నూరు పట్టణ ఎస్ఐపై వీరంగం

ప్రజాశక్తి - పొన్నూరు

పట్టణం లోని ఐలాండ్ సెంటర్లో పోలీస్ అవుట్ పోస్టు దగ్గర పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పట్టణ ఎస్ఐ రాజకుమార్ పై వాసు అనే వ్యక్తి వీరంగం చేశాడు. అనుచితంగా ప్రవర్తించిన ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం పట్టణ ఎస్ఐ రాజకుమార్, అర్బన్ సీఐ జీప్ డ్రైవర్ మహేష్‌లు విధులు నిర్వహిస్తుండగా వాసు వారిపై అసభ్య పదజాలంతో అను చితంగా ప్రవర్తించాడు. 'మీ అంతు చూస్తాను' అని బెదిరించాడని ఎస్ఐ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉద్దేశపూర్వ కంగా వాసు తమ విధులకు ఆటంకపరిచి, ట్రాఫిక్ ను స్తంభింపజేసి దౌర్జ న్యం చేశాడని ఫిర్యాదు చేశాడు. కాగా గతంలో వాసు పై పలు స్టేషన్లలో నమోదు చేసిన కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పొన్నూరు అర్బన్ స్టేషన్ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి -నకరికల్లు

గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళను కత్తి తో బెదిరించి మెడలో నాన్ తాడు ను లాక్కొని పారిపోయిన సంఘటన నరసింగపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం నరసింగపాడుకి చెందిన బాదం. వెంకటరమణ పొలంలో గడ్డి కోస్తుండగా గుర్తు తెలియని యువకుడు ఈ పొలం ఎవరిదంటూ ఆమెతో మాట్లాడుతూ కత్తితో బెదిరించాడు. సుమారు 28 గ్రాముల బంగారు నాన్ తాడు లాక్కొని పారిపోతుండగా బాధిత మహిళా వెంట పడింది. అతను తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై కారంపూడి వైపు పారిపోయినట్లు బాధితురాలు తెలిపింది. వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల మండలం, రాయవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టుపై నుండి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. రాయవరానికి చెందిన అమరేష్ పెద్ద అంకారావు శుక్రవారం మధ్యాహ్న సమయంలో తాటిముంజలు కొట్టేం దుకు చెట్టుపైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. గాయాలకు గురైన అతనిని 108 వాహనం ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించారు.

ప్రమాదానికి గురైన ఆర్టిసి బస్సు, పక్కనే ప్రమాదానికి కారణమైన క్రేన్

ఆర్టీసీ బస్సును ఢీకొన్న క్రేన్

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గుంటూరు నుంచి తెనాలి వస్తున్న ఆర్టిసి బస్సు శుక్రువారం ప్రమాదానికి గురయ్యింది. గుంటూరు 2 డిపో నుంచి తెనాలి వస్తున్న పల్లెవెలుగు ఆర్టిసి బస్సు మార్కెట్ రిక్వెస్ట్ స్టాప్ కు చేరుకుంది. అక్కడినుంచి ప్రియ డీలక్స్ మీదుగా డిపోకి చేరుతున్న సమయంలో అకస్మాత్తుగా భారీ క్రేన్, బస్సు ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి బస్సు పైకప్పు పూర్తిగా ధ్వంసం అయ్యింది. బస్సులో ప్రయాణీకులు ఎక్కువుగా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు ఆర్టిసి తెనాలి డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడితో పాటు ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తికి స్వల్ప గాయలైనట్లు త్రీ టౌన్ ఎస్సై ప్రకాశరావు వివరాలు వెల్లడించారు. జరిగిన ప్రమాదంపై పూర్తి విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-వినుకొండ

సూపర్ స్టార్, నట శేఖర్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసు పత్రిలో పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌లో అల్పాహారం, ఏనుగుపాలెం రోడ్ లో పులిహార పం పిణీ చేశారు. అనేక చోట్ల అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణ అభిమానులు అందరూ ఒక కమిటి ఏర్పా టు చేసుకొని, అన్ని అనుమతులతో త్వరలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటం చేసుకుంటామని వారు చెప్పారు. పీవీ సురేష్ బాబు,తులం శీను, చికెన్ బాబు. షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రముఖ న్యాయవాది ఎంవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ ,మహేష్ బాబు అభిమానులు వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు చందలూరి రంగా, సహారా మీరా,మదమంచి రాంబాబు,వల్లెం చెన్నకేశవ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

సినీ నటుడు సూపర్ స్టార్ కష్ణ 81వ జయంతి సందర్భంగా తెనాలి బోస్ రోడ్ లో తన అభిమాన సంఘాలు శుక్రువారం మజ్జిగ పంపిణీ చేశారు. సూపర్ స్టార్ వీర అభిమాని ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వితరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గున్నారు. ఎర్రగుంట్ల మహేష్, జొన్నకూటి నీలాంబరం, గోపి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల

కృష్ణ జయంతి వేడుకలను స్థానిక ముర్తుజానగర్ జెండా చెట్టు సెంటర్ వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి వైసిపి మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ జాన్ షైదా, షేక్ సమీఉల్లా, ఖాదర్ బేగ్, మహమ్మద్ ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని ఛాంబర్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ ఫ్యాన్స్ యూత్ విం గ్‌కు సంబంధించిన సాకేత్‌కు స్మారక పురస్కారం అందజేశారు. జె.వి.మోహన్ గౌడ్, పాలెపు రామారావు, కృష్ణ ఫ్యాన్స్ చంటి, జాయింట్ సెక్రటరీ పులి రమణారెడ్డి, గోగినేని ధనశేఖర్, ఉజ్జనేని వంశీ పాల్గొన్నారు.

భార్యపై దాడి.. భర్త పరార్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి కొత్తపేటలో శుక్రవారం దారుణం చోటు చేసుకుంది. భార్య మీద అనుమానంతో భర్త చిల్లా రవి (35) దాడి చేశాడు. భార్యపై కూరగాయల కత్తితో మెడ వెనకబాగంలో దాడి చేసి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం నిమిత్తం గాయపడిన వివాహితను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వన్ టౌన్ ఎస్సై కరీముల్లా వివరాలు వెల్లడించారు. ప్రస్తుతానికి ఆమెకు ప్రాణహాని లేదన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

35 మందిపై రౌడీ షీట్లు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలో 35 మంది పై రౌడీషీట్లు తెరిచినట్లు పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు లో నలుగురిపై, హుస్సేనగరంలో ముగ్గురిపై, తాళ్లూరులో 8 మంది పై, ఖమ్మంపాడు లో 16 మందిపై, బలుసుపాడులో నలుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. వీరిలో టిడిపి, వైసిపి నాయకులు ఉన్నారు. ఎంతటి వారైనా గొడవలలో పాల్గొంటే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాలు బంద్

ఒకటవ తేదీ సాయంత్రం నుండి ఐదవ తేదీ సాయంత్రం వరకు అన్ని షాపులు మూసివేయాలని జిల్లా అధికారులు నుండి ఆదేశాలు అందాయన్నారు. అత్యవసర సర్వీసులు మినహా మిగిలిన వాటికి వర్తిస్తుందన్నారు. శనివారం జరిగే హనుమాన్ జయంతి వేడుకలకు ఎవరికి అనుమతులు లేవన్నారు. ఎవరింట్లో వారు జరుపుకోవడమే గాని బహిరంగంగా జరపవద్దని ఎస్ఐ కోరారు.

పోలీస్ నిబంధనలపై ప్రచారం

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసు నిబంధనలను గురించి శుక్రవారం ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆటో ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులు వివిధ వర్గాల ప్రజలు పాటించాల్సిన నిబంధనలపై మైకు ద్వారా వివరించారు. విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధమని, వ్యాపార దుకాణాలు ఉదయం 10 గంటలకే మూం వేయాలని.. ఆరో తేదీ వరకు ఈ నిబంధన అమల్లో ఉంటుందని తెలిపారు.

మద్యం బాటిల్లు స్వాధీనం

మల్లవరం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న యువకుడు పోలీసులను చూసి పరారైనట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు 20 క్వార్టర్లు మద్యం నాలుగు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

341 మందిపై బైండోవర్ కేసులు

రెంటచింతలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన ఎస్పీ 341 బైండోవర్ కేసులు 103 మందిపై రౌడీ షీట్లు ఓపెన్ మే 13 న నిర్వహించిన పోలింగ్ రోజున అంతకు ముందు రోజు జరిగిన అల్లర్లు, దాడులు, ఘర్షణలు జరిగిన తీరును జిల్లా పోలీస్ యంత్రాంగం సీరియస్ గా తీసుకుంది ఈ గొడవల వల్లనే ఎస్పీ బిందు మాధవ్ సస్పెండ్ కావడంతో పాటు సిఐ నారాయణస్వామి పై దాడులకు పాల్పడ్డాన్ని ఆ శాఖ ఉన్నతాధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెంటచింతల మండలం గొడవలపరంగా వార్తల్లోకి ఎక్కింది. అందులో భాగంగా 251 మంది పోలీసులను ఈ మండలానికి కేటాయించారు.103 పై రౌడీషీట్లు 341 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్‌కు లక్ష రూపాయల విరాళాన్ని అందజేస్తున్న వెంకటరాయుడు

పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి లక్ష విరాళం

ప్రజాశక్తి-వినుకొండ

జన విజ్ఞాన వేదిక, ఇతర ప్రజా సంఘాలు కలిసి నరసరావుపేటలో నిర్మిస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శావల్యాపురం మండలం వేల్పూరు నివాసి బోయపాటి వెంకటరాయుడు శుక్రవారం ఒక లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుటకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో విజ్ఞాన కేంద్ర నిర్మా ణం జరుగుతుందని ఆయన చెప్పారు. పల్నాడు సంస్కృతీ సంప్రదాయాలు చరిత్ర ముందు తరాలకు తెలియ జేయడం, అభ్యుదయ భావాలు శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించడం కోసం విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని చెప్పారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్టీ చైర్మన్ గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ కళలు,సంస్కృతి,శాస్త్రీయ ఆలోచన విధానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహణ విజ్ఞాన కేంద్రం లక్ష్యాలని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్ మోహన్ చంద్, సిఐటియు మండల కార్యదర్శి భువనగిరి వెంకటేశ్వర్లు జిల్లా యువజన సంఘం నాయకులు వెంకటేశ్వరరాజు, ఎస్. గోవింద్ పాల్గొన్నారు.

'జగన్ మాటల నమ్మి బెట్టంగ్‌లకు పాల్పడవద్దు'

ప్రజాశక్తి-వినుకొండ

వైసిపి ఓటమి కళ్ల ముందు కనిపిస్తున్నా తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సొంత పార్టీవాళ్లనే ముఖ్యమంత్రి జగన్ ముంచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు. విమర్శించారు. అధికారులను ఇంకా భయంలో ఉంచడానికి, పార్టీకి అనుకూలంగా బెట్టింగ్‌లను ప్రోత్సహించడానికే పెయిడ్ సర్వేలతో అందర్నీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని శుక్రవారం ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు సచివాలయం, తాడేపల్లి ప్యాలెస్ నుంచి సామాన్లు సర్దుకుంటూనే, మరోవైపు మళ్లీ గెలుస్తున్నామన్న జగన్ మేకపోతు గాంభీర్యాన్ని నమ్మి ఎవరూ మోసపోవద్దని, పొరపాటున కూడా ఎవరూ ముఖ్యమంత్రి జగన్ మాటలు నమ్మి, బెట్టింగ్‌లకు పాల్పడవద్దని కోరారు. గిట్టని అధికారుల పట్ల వైసిపి చేస్తున్న దుష్ప్రచారంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, పెద్ద సజ్జల, పిల్ల సజ్జల పప్పులు ఉడకకపోవడంతోనే ఇలాంటి నీచరాజకీయాలకు దిగుతున్నారని విమర్శించారు.

జూన్ 5 వరకు షాపులు బంద్

ప్రజాశక్తి-ఈపూరు

జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నేటి సాయంత్రం ఐదు గంటల నుండి ఐదవ తేదీ ఉదయం వరకు స్వచ్ఛందంగా షాపులు మూసివేయాలని ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ శుక్రవారం తెలిపారు.ప్రజలు నిత్యావసర వస్తువులు ముందుగానే తెచ్చుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా కాల్చడం, ర్యాలీలు, ఊరేగింపులు లాంటి కార్యక్రమాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. రోడ్లపై ప్రజలు గుంపులుగా ఉండరాదని పోలీసు వారి నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.గ్రామ ప్రజలు, షాపుల యజమానులు పోలీసు వారికి సహకరించాలని ఆయన కోరారు.

పత్తి విత్తనాలు.. బ్లాక్ మార్కెట్లో

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుంది. రైతులకు విత్తనాలు కొనుగోలు ప్రారంభించే దశ వచ్చింది. దీనిని వ్యాపారులు అదునుగా తీసుకొని పలానా రకం విత్తనం అందుబాటులో లేదు. ఫలానా విత్తనం తక్కువగా ఉంది. ఆ రకం గతేడాది బ్రహ్మాండమైన దిగుబడి సాధించింది. రైతులందరూ ఆ విత్తనం కోసమే ఆసక్తి చూపుతున్నారు.. అని కంపెనీల ప్రతినిధులు, డీలర్లు ముందుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో రైతులు వాటి వైపు మొగ్గు చూపుటం పరిపాటైంది. పత్తి విత్తనాలు ఎంఆర్‌పి పరిధిని దాటి బ్లాక్ మార్కెట్లో క్రయవిక్రయాలు జరుగు తున్నాయి. ప్రతి సంవత్సరం ఎంఆర్‌పిని ప్రభుత్వాలు నిర్ణయిస్తున్నాయి. ఈ సంవత్సరం 450 గ్రాముల విత్తన ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.860గా నిర్ణయించారు. అయితే ఇవెక్కడా అమలు కావడం లేదు.

మండలంలో గతేడాది 11379 ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ ఏడాది కూడా దాదాపు అదే విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారుల అంచనా. ఎకరానికి సగటున రెండు పత్తి ప్యాకెట్లు అవసరం ఉంటుంది. ఒక ప్రముఖ కంపెనీకి చెందిన ప్యాకెట్ మార్కెట్లో రూ.1200 నుంచి రూ.1300 వరకు అమ్ముతున్నారు. మరో కంపెనీ విత్తనాలు రూ.1300 నుంచి రూ.1400 వరకు అమ్ముతున్నారు. అత్యధిక దిగుబడినిచ్చే విత్తనాలు అని ప్రచారం చేసుకునే మరో కంపెనీ ప్యాకెట్‌ను రూ.1500కు అమ్ముతున్నారు. ఇవి కూడా తమ హితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల ద్వారా మాత్రమే గోప్యంగా అందిస్తున్నారు. కొంతమంది బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు ఇచ్చినా వసూలు చేసే ధర కాకుండా ఎంఆర్‌పి ధర మాత్రమే రాసి ఇస్తున్నారు.

ఆర్‌బికెల్లో విత్తనాలేవి?

విత్తు నుండి పంట విక్రయం వరకు రైతుల సేవలో రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉంటాయని పాలకులు పదేపదే ప్రక టించినా ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. విత్త నాలు ఒక సంవత్సరం వరకు మాత్రమే అందించారు. ఆ సందర్భంలో విత్తనాలు ఎంఆర్‌పికి ఇవ్వ డంతో దుకా ణాల్లోనూ ఎంఆర్‌పి ధరలకు మించి విత్త నాలు విక్రయించ లేదు. అయితే తర్వాత ఆర్‌బికెల్లో విత్త నాలు అందు బాటులో లేకపోవడంతో రైతులు అని వార్యంగా ప్రైవేటు వ్యాపారులపై ఆధార పడాల్సి వచ్చింది. దీంతో వారు మళ్లీ అధిక ధరలకు అమ్మడం మొదలు పెట్టారు.

ఎన్నికల విధుల్లో వ్యవసాయ శాఖ

విత్తన దుకాణాలను తనిఖీ చేయాల్సిన, ధరల నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు మొన్నటి వరకు ఎన్నికల విధుల్లో తల మునకలై ఉన్నారు. ప్రస్తుతం కౌం టింగ్ ప్రక్రియలో బిజీగా ఉన్నారు. దీంతో వ్యాపారులు పని మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లు తోంది. కొంతమంది అధి కారులు అధిక ధరల విషయమై తెలిసినా చూచిచూడనట్లు వ్యవహరి స్తున్నారని విమర్శలున్నాయి. దీనికి షాపుల నిర్వాహకులకు, కంపె నీలకు ప్రత్యక్షంగా పరోక్షంగా రాజకీయ పార్టీల అండదండలు ఉండటమే కారణ మని తెలుస్తోంది. అధిక ధరలు అమ్మే షాపుల్లో అధికారులు తనిఖీలు చేస్తే రాజకీయ నాయ కులు జోక్యం చేసుకొని తూతూ మంత్రంగా వ్యవహరించాలని ఆదేశాలు గతంలో కోకొల్లలు.

ధర అడిగితే లేవంటున్నారు..

షాపుల్లో విత్తనాలను ఎంఆర్‌పి కంటే ఎక్కువగా అమ్ముతున్నారు. వారు చెప్పిన ధర కాకుండా మరో ధర అడిగితే విత్తనాలు లేవని అంటున్నారు. ప్రతి సంవత్సరం విత్తనాలు ధరలు పెంచుతున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

శ్రీనివాసరావు, రైతు, కాశిపాడు.

టెక్నికల్ సమస్యలు పరిష్కరించి..

'హామీ' పనులు చూపండి

ప్రజాశక్తి-క్రోసూరు

టెక్నికల్ సమస్యలను వెంటనే పరిష్కరించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా తమకు పనులు చూపించాలని పెరికపాడులోని వ్యవసాయ కూలీలు కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం క్రోసూరులోని ఎన్ఆర్ఇజిఎ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ) కార్యాలయం వద్ద స్థానిక ఎపిఒని కలిసి అర్జీ అందజేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ పెరికపాడులో ఉపాధి హామీ పనులు చేయ డానికి చాలామంది కూలీలు సిద్ధంగా ఉన్నారని, 20 రోజులు క్రితం జరిగిన గ్రామ సభలో పనులు చేయించాలని, అర్జీ పెట్టినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని అన్నారు. పేర్లు ఆన్‌లైన్‌లో కనపడకపోవడం వలన పనులు చేయడానికి వీలు లేకపోవడంతో ఇప్పటికీ సుమారు 80 మంది వ్యవసాయ కార్మికులు ఖాళీగా ఉన్నారన అన్నారు. గత సంవత్సరం పనిచేసిన వారి పేర్లు కూడా ఆన్‌లైన్‌లో కనబడటం లేదని అన్నారు. గత సంవత్సరం పని చేసిన కొంతమంది వ్యవసాయ కూలీలకు బిల్లులు రాకపోవడం వలన ఈ ఏడాది కూడా బిల్లులు ఆగిపోతాయేమోనని వారు ఆందోళనలో ఉన్నారని , సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కారించాలని కోరారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొత్త వ్యక్తిని నియమించడం వలన కొంత ఇబ్బంది ఉందని, కొంతమంది బ్యాంకు అకౌంట్లు, ఆధార్ కార్డులో టెక్నికల్‌గా సమస్యలు ఉన్నాయని, వారి వివరాలు ఎఫ్ఎకు తెలియజేసినట్లు చెప్పారు. ఈ నెల 3న సోమవారం మరొక సారి గ్రామ సభ జరిపి వ్యవసాయ కూలీలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కుంభలక్ష్మి, బి. అరుణ, ఏపూరి శేషమ్మ, బయ్యవరపు అలివేలు, బి. రేణుక, కె.జోజమ్మ, వై.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎపిఒని కలిసి అర్జీ అందజేస్తున్న పెరికపాడు వ్యవసాయ కూలీలు

పని దినాలను 200 రోజులకు పెంచండి

ప్రజాశక్తి-క్రోసూరు

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పని దినాలను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్య దర్శి జి రవిబాబు అన్నారు. మండలంలోని 88 తాళ్లూ రులో శుక్రవారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లా డుతూ వర్షాభావ పరిస్థితులలో ఈ చట్టం కింద కల్పిస్తున్న 100 రోజులు ముగ్గురు సభ్యులు ఉన్న కుటుం బంలో నెలరోజులకే పూర్తవుతాయని అన్నారు. వ్యవసాయ పనులు లేని రోజులలో పెరిగిన కుటుంబ ఖర్చులకు తగిన ఆదాయం రావాలి అంటే పని దినాలను 200 రోజులకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇస్తున్న కూలిని కూడా రూ.500 పెంచాలని, మెట్ల వ్యవస్థను కొన సాగించి వారికి ప్రత్యేకమైన అలవెన్స్ ఇవ్వాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్, మజ్జిగ, మంచి నీళ్లకు ప్రత్యేకమైన అలవెన్స్‌లు ఇవ్వాలనే విషయమై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. వీటిని సాధించడం సంఘం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, అటువంటి సంఘాన్ని బల పర్చుకోవ డానికి కూలీలంతా ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సం ఘం మండల అధ్యక్షులు ఏపూరి వెంకటేశ్వర్లు, తాతారావు పాల్గొన్నారు.

88 తాళ్లూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జి.రవిబాబు

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

పని ప్రదేశాలను పరిశీలించిన వ్యకాస, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - పెదకాకాని

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ లో పనిచేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కార్మికులు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని రెండుసార్లు ఫోటోలు తీయడానికి పనిచేసిన తర్వాత కూడా గంటల తరబడి చెట్ల కింద ఉండాల్సి వస్తుందని దీనితో వడదెబ్బ బారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముళ్ళకంప తీసివేసే పనిచేయడం వల్ల కాళ్ళకి, చేతులకి ముళ్ళు గుచ్చుకొని ఇబ్బంది పడుతున్నామని కనీసం మెడికల్ కిట్టు కూడా అందుబాటులో లేదని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రూ.300 కనీస వేతనం ప్రభుత్వ నిర్ణయించినప్పటికీ ఎవరికీ పడటం లేదని కేవలం 200 రూపాయల నుండి 250 రూపాయలు మాత్రమే కూలి పడుతుందని తెలిపారు . గతంలో ప్రభుత్వం ఇచ్చేటువంటి సదుపాయాలని ఈ సంవత్సరం అమలు చేయకుండా తీసివేసిందని ఇది సరైనది కాదని విమర్శించారు .సమ్మర్ అలవెన్స్ 30 శాతం గతంలో ఉండేదని దానిని కూడా అమలు చేయడం లేదని కనీసం మంచినీరు కూడా అందుబాటులో ఉంచడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని దానిలో భాగమే ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం లాంటి మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. అలాగే ఉపాధి హామీ కూలీలు పనిచేయడం లేదని ఊరికే డబ్బులు తీసుకుంటున్నారని దుష్ప్రచారం చేస్తూ ఉపాధి కూలీలపై అభాండాలు వేస్తున్నారని తెలిపారు. కూలీ డబ్బులు పనిచేసిన కొలత ప్రకారమే వస్తాయి తప్ప ఊరికే డబ్బులు ఇవ్వరని అన్నారు. ఉపాధి హామీ కూలీలు గ్రామం నుండి ఐదారు కిలోమీటర్లు వెళ్లి పనులు చేస్తున్నారని, ఉపాధి హామీ పనుల వల్ల కాలువలు బాగుపడ్డాయని నీరు సక్రమంగా పంట పొలాలకు వస్తుందని వ్యవసాయ రంగం అభివృద్ధికి ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. ఇటువంటి పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని దానిలో భాగమే ఉపాధి హామీలో రకరకాల మార్పులు తీసుకొచ్చి ఉపాధి పని యడల కూలీలకు విరక్తి కలిగి తమంతటికి తాము పనులు మానుకునే విధంగా చూస్తుందని తెలిపారు. ఇప్పటికైనా రెండు పూటలా పనిని రద్దుచేసి గతంలో ఇచ్చిన సదుపాయాలని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించిన ఈమని అప్పారావు, నన్నపనేని శివాజి

పంటకాల్వలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కృష్ణ, పశ్చిమ డెల్టా పరిధిలో ప్రధాన పంట కాల్వలు, ఉపకాల్వల్లో సత్వరమే మరమ్మతులు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివ శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివశంకరరావు మాట్లాడుతూ పంట కాల్వలు, మురుకాల్వల్లో తూటాకు, గుర్రపు డెక్కల తో పాటు మేటలు కట్టిన కాల్వలను మరమ్మతులు చేయకపోవడం శోచనీయమన్నారు. అధికారుల అల సత్వం కారణంగా పశ్చిమ డెల్టా పరిధిలో 5.75 లక్షలు ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్న రైతు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దుగ్గిరాల మండలంలో కొమ్మ మూరు, పిడపర్రు లాకులు శిథిలావస్థకు చేరు కున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. తూటాకు, గుర్రపు డెక్క, వగైరాలను తొలగించకపోవడం కారణంగా గత ఏడాది వెదపెట్టిన వరి దెబ్బతిందని, ఎకరానికి రూ .10 వేలు నష్టం వాటిల్లిందని అన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులకు శుక్రువారం వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి మాట్లాడుతూ టిఎస్ ఛానల్ పరిధిలోగల ఆరెమండ స్లూయజ్ కాల్వలో వేసిన ఇసుక బస్తాలు నీటి ఒరవడికి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తెలియ పర్చారు. అధికారులు అలసత్వం వహిస్తే రూ.26 వేల ఎకరాల్లో పంట నష్టంవాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పెదవడ్లపూడి హై లెవల్ ఛానల్‌కు రూ .1 కోటి మంజూరు చేస్తే 25 వేల ఎకరాల ఆయకట్టకు నీరు అందుతుందని అన్నారు. కెవి సత్యన్నారాయణ మాట్లాడుతూ జీలుగు, పిల్లి పెసర, పచ్చి రొట్ట విత్తనాలతో పాటు జింక్, బోరాన్ ఎరువులను కూడా అందించాలని అన్నారు. ఈదర పూర్ణచంద్, మేకల చిట్టిబాబు, షేక్ హుస్సేన్ వలి తదితరులు డ్రైనేజి, మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జొన్నా శివశంకరరావు, ములక శివ సాంబిరెడ్డి, ఈదర పూర్ణచంద్ తదితరులు

కార్మిక హక్కుల కోసం ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-గుంటూరు

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సిఐటియు) 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ గుంటూరు నగర తూర్పు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంజీవయ్య నగర్‌లోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న ఏర్పడిన సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా గుర్తింపు సంపాదించిందన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించే వేగుచుక్క సిఐటియు అని అన్నారు.దేశంలో ఏమూల కార్మికులకు సమస్య ఉన్నా ప్రతి కార్మికుడు గుర్తించే సంఘంగా సిఐటియు కార్మికుల హదయానికి హత్తుకునేలా పోరాడుతుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, కార్మికుడి శ్రమకు తగ్గ ఫలితం కోసం సిఐటియు అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఆటో, బిల్డింగ్, ముఠా, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న సంఘం సిఐటియు అన్నారు.విద్యుత్ ప్రైవేటీకరణ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ నికరంగా పోరాడుతున్న సంఘం సిఐటియు అన్నారు. సిఐటియు తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలపై చాంపియన్‌గా సిఐటియు పనిచేస్తుందని తెలిపారు. ముందుగా సిఐటియు జెండాను అంగన్వాడీ యూనియన్ నాయకురాలు యం.శోభారాణి జండా ఆవిష్కరించగా అంగన్వాడీ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి జి.శంకర్రావు, ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎన్.కేజియ తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ఆర్.నాగేశ్వరి,

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అంగన్వాడీ ఖాళీ పోస్టులో హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి -చేబ్రోలు

అంగన్వాడి హెల్పర్లకు ప్రమోషన్ల విషయంలో జాప్యం సరికాదని, ఖాళీఅయిన అంగన్వాడీ పోస్టుల్లో హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం చేబ్రోలులో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతు ప్రమోషన్ విషయంలో కాలయాపన చేయడం వల్ల అక్కడ ఉన్న హెల్పర్ రెండు పనులు చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ పరిస్థితి సంవత్సరాలు పాటు కొనసాగటం వల్ల వారిపై పని ఒత్తిడి అదనంగా పెరిగి మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన తక్షణమే హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా తక్షణమే అంగన్వాడీలకు హెల్పర్లకు వేతనాల పెంపు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, మంజూష, లక్ష్మీ తిరుపతమ్మ, మరియమ్మ, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

సందర్శించిన కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు

టిడ్కో ఇళ్ల తాగునీటి కొరతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో గృహాల వద్ద తాగునీటికి అంతరాయంపై శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ వి నిర్మల కుమార్ వెంటనే స్పందించి ఏపీఐఐసి రోడ్డులో గల పంపు హౌస్‌ను సందర్శించారు. అందులో గల 7.5 హెచ్పి మోటర్ కాలిపోవటం వలన టిడ్కో గహాలకు స్వల్ప అంతరాయం కలిగినదని ఆ సమస్యను ఇంజనీరింగ్ విభాగం వారికి తెలియజేసి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టడమే కాకుండా అవసరమైనచో అదనంగా నూతన మోటర్ కొనుగోలు చేస్తామని ఆయన తెలియజేశారు. అనంతరం కమిషనర్ టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి ఆయా పైప్ లైన్లో వాల్వులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బ్లాక్ వారు స్వతహాగా వారి వారి పైప్ లైన్ లో వాల్వ్ లను ఆపరేట్ చేసుకుంటున్నారని ఈ ముఖ్యమైన కారణం వలన మిగిలిన బ్లాకుల వారికి నీటి కొరత ఏర్పడుచున్నదని ఆయన స్పష్టం చేశారు. నీటి ట్యాంకర్లు సరైన సమయంలో వస్తున్నదా లేదా అని ఆయన అడిగి తెలుసుకున్నారు.

మండలంలో ఊరేగింపులు నిషేధం

ప్రజాశక్తి - తాడికొండ

జూన్ 4న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో జూన్3 నుండి 5వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తాడికొండ సిఐ కే ప్రభాకర్ రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి ఎనిమిది గంటల నుండి ఆయా గ్రామాలలో వ్యాపార దుకాణాలు మూసివేయాలన్నారు. పోలీసుల గస్తీ నిత్యం ఉంటుందన్నారు పై తేదీలలో పూర్తిగా మద్య నిషేధం ఉంటుందన్నారు గ్రామాలలో సీసీ కెమెరాలు, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు సందర్భంగా గ్రామాలలో ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు కాల్చడం నిషేధమన్నారు .ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 40 మందిపై బైండవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

నరసరావుపేటలో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ బి.రవి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆధ్వర్యంలో శుక్రవారం 'పొగాకు లేని పల్నాడు జిల్లాను నిర్మిద్దాం.. క్యాన్సర్ రహిత పల్నాడు జిల్లాను సాధిద్దాం' అని వైద్య సిబ్బందితో ప్రమాణం చేయించారు. నరసరావుపేటలో ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. యువత పొగాకు, మద్యపానం, మాదక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని ఆస్వాదిస్తూ జీవితంలో ఒక నిర్ణాత్మకమైన గౌరవ ప్రదమైన సమాజంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ధూమపానం చేసేవారికి బిసిజి వాక్సిన్ వేయించేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పొగాకు వల్ల అనేక రకాల వ్యాధులు సంభవిస్తాయన్నారు.ఇప్పటికే ధూమ, మద్య పానాలకు బానిసలై ఇబ్బంది పడుతున్నట్లయితే డి అడిక్షన్ సెంటర్లలో సంప్రదించి ఉన్న అలవాట్లకు దూరం కావా లన్నారు.

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ నేటి యువత సమాజంలో మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను అర్థంతరంగా ముగుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు, మద్యం, గుట్కా, పాన్ పరాక్, సిగరెట్ మాదకద్రవ్యాలకు బానిస అవడం బాధాకరమన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కాన్సర్, గుండె జబ్బులు వస్తాయన్నారు. ప్రతిజ్ఞ అనంతరం నరసరావుపేటలో ప్రధాన కూడళ్లలో పొగాకు వినియోగం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ డి పి నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్,డాక్టర్ రాజరాజేశ్వరి, జిల్లా మల రియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటెపూడిలో మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చిత్రం

జీవనోపాధిని మెరుగుపరుచుకోండి

ప్రజాశక్తి - సత్తెనపల్లిరూరల్

మగ్గం వర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకొని కుటుంబానికి తోడ్ప డాలని యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందం కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి కమ్యూనిటీ హాల్‌లో యూనియన్ బ్యాంకు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్కు పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మగ్గం వర్క్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఫ్యాకల్టీ రాజశేఖర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు యూనియన్ బ్యాంక్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ మేడ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులలో పెరుగుతున్న ఉత్కంఠ

- ఓట్ల లెక్కింపు రోజు కోసం ఎదురు చూపులు
- ఈవీఎం, వీవీ ప్యాట్లకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులలో ఉత్కంఠ పెరుగుతోంది. ఇప్పటి వరకు వివిధ లెక్కలతో వివిధ రూపాలలో చేయించిన సర్వేలతో గడిపిన నేతల్లో లెక్కింపు ప్రక్రియ దగ్గర పడుతున్న కొద్దీ గుబులు చెందుతున్నారు.

కార్యకర్తలలో రెట్టింపు ఉత్కంఠ

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల కంటే ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలలో రెట్టింపు ఉత్కంఠ పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామాల వారీగా తమకెన్ని ఓట్లు వస్తాయోనని లెక్కలు వేసుకుంటున్నారు. ఇవి కూడా పోలింగ్ అనంతరం స్టడీల పేరుతో వివిధ ప్రైవేటు సంస్థలు చేసిన సర్వేలను చూసు కున్నాయి. దీంతో కొందరు ఉపశమనం పొందగా, మరికొందరిలో కొంత ఆందోళన నెలకొంది. చాలా మంది నాయకులు కాస్త సేద తీరేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు వారంతా నియోజకవర్గాలకు చేరుకుంటుండటంతో వారి వద్దకు అనుచరులు చేరుకుని మళ్లీ లెక్కలేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

మరోవైపు లెక్కింపునకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి లోపాలు తలెత్త కూడదని, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని ప్రతి రోజూ సమావేశాలు నిర్వహించి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పరిధిలోన జె.ఎన్.టి.యు కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్లపై నిఘా నేత్రాలు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య భద్రత ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాలకు వేర్వేరుగా గదులు కేటాయించారు. వాటిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపరిచారు. 20 కం పెనీలకు చెందిన కేంద్ర పోలీసు బల గాలు, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తును ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్య వేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా, డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఇటీవల స్ట్రాంగ్ రూమ్ లను పరి శీలించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు చేపట్టాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. ఆయా రాజ కీయ పార్టీల అభ్యర్థులు వస్తే వారికి కూడా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సిసి కెమెరాల ద్వారా ఈవీ ఎంలను చూపిస్తున్నారు.

లెక్కింపు ఏర్పాట్లలో అధికారుల హడావుడి

ఈ నెల 4 న జరగనున్న లెక్కింపునకు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులంతా హడావుడిగా ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు జరిగేలా జాగ్రత్తలు తీసు కుంటున్నారు. లెక్కింపుపై పూర్తి అవ గాహన ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

లెక్కింపు ప్రక్రియకు సం బం ధించి ప్రతి రోజూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తు న్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఏ విధంగా వ్యవహరించాలన్న దానిపై కూడా అవగాహన సమావేశాలు నిర్వహించారు.

'ఓటమి భయంతోనే పోస్టల్ బ్యాలెట్‌పై వైసిపి వివాదం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల ఓటమి భయంతోనే అధికార వైసిపి ఉద్యోగుల పోస్టల్ బ్యాలె ట్‌పై వివాదాల రేపేందుకు తంటాలు పడుతోందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమ్మడి కోటమి చిలకలూరిపేట నియోజకవర్గ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. స్థానిక పండరీపురంలో గల తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను రాచిరంపాన పెట్టి, కర్కశంగా అణిచి వేసింది చాలక ఇప్పుడు వారి ఓట్ల విషయంలోనూ చిక్కులు పెడుతుండడం దుర్మార్గమన్నారు. పోస్టల్ బ్యాలెట్ల జారీ, పోలింగ్ సమయంలోనే సాధ్యమైనంత మందికి ఆ అవకాశం లేకుండా అడ్డుకోవాలని, తమవైపు తిప్పుకోవాలని విఫలయత్నాలు చేసిన వైసిపి, ఇప్పుడు ఆ ఓట్లను చెల్లుబాటు కాకుండా చేసేందుకు మోకాలడ్డుతోందన్నారు. పోలైన మొత్తం పోస్టల్ ఓట్లలో కనీసం 90 శాతం తెలుగుదేశం కూటమికే పడ్డాయన్న అంచనాలతో జగన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు.

కార్యకర్తలు సంయమనం పాటించాలి

టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో ప్రశాంత వాతావారణం కల్పించేందుకు బిజెపి, జనసేన, టిడిపి కేడర్ ఐకమత్యంగా కృషి చేయాలని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ప్రజల తీర్పు ఎన్‌డిఎ కూటమి వైపు ఉందని వైసిపి గ్రహించి కవ్వింపు చర్యలకు దిగుతుందని, వారి చర్యలకు కూటమి నాయకులు, కార్యకర్తలు స్పందించవద్దని కేడర్‌ను కోరుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటమిని ముందే గ్రహించిన వైసిపి పార్టీ అగ్రనేతలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిసున్న వైనాన్ని కేడర్ గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావారణం ఉంటేనే నియోజకవర్గ అభివృద్ధి అనే విషయాన్ని కేడర్ గుర్తించాలన్నారు. పల్నాడులో శాంతి కుసుమాలు విరిసేందుకు ప్రతి ఒక్కరు ఐకమత్యంగా ఉండాలన్నారు.

అల్లర్లకు, గొడవలకు పాల్పడ వద్దు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రూరల్ పోలీస్ స్టేషన్ పోలీస్ వారి విజ్ఞప్తి. మండల పరిధిలో అన్ని గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ప్రజలు ఎవరు గుంపులుగా బయట తిరగకూడదని రూరల్ సి.ఐ. శ్రీనివాసరెడ్డి శుక్రవారం అన్ని గ్రామాల గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు సహకరించి ఎవరి యిళ్లలో వారు ఉండాలన్నారు. కౌంటింగ్ రోజు జూన్ 4న బాణాసంచా కాల్చేందుకు, ఎలాంటి సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు పర్మిషన్ లేదని, ఎవరు కూడా రోడ్లపైకి రాకూడదని తెలిపారు. ఎవరూ కూడా అల్లర్లకు గొడవలకు పాల్పడ వద్దని హెచ్చ రించారు. జూన్ 1 వతేదీ సాయంత్రం 5:00 గం టల నుండి 5వ తేదీ ఉదయం వరకు అన్ని రకాల షాపులు మూసి వేయాలన్నారు. ఈ విషయమై ముందస్తుగానే అంద రికి తెలియజేశామన్నారు. ప్రజలు తమకు కావల సిన వస్తువులు, సరుకులు ముందుగానే తీసుకోవాలని సూచించారు. పైన సూచించిన తేదీల్లో దుకాణాల యజమానులు తమ షాపులను స్వచ్ఛందంగా మూసవేసి పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ

పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన సిబ్బందిని పల్నాడు ఎస్పీ మల్లికా గార్గ్ ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పదవీ విరమణ చేసిన వారినిఎస్సై ఎ. మోహన్ రెడ్డి, ఎఎస్ఐ బి.ప్రసాదరావు, నకరికల్లు పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వ హిస్తున్న కె.లక్ష్మణరావు, చిలకలూరిపేట గ్రామీణ పోలీసు స్టేషన్ లో పని చేస్తూ పదవీ విరమణ పొందిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ రాఘవేంద్ర, అదనపు ఎస్పీ ఏఆర్ రామచంద్రరాజు, అడ్మిని స్ట్రేషన్ ఆఫీసర్ రామరావు, ఆర్ఐ వెల్ఫేర్ గోపీనాథ్, ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని మండల అభివృద్ధి అధికారి మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 1920 మందికి ఇంటింటికి తిరిగి పెన్షన్లు అందిస్తామని, వీరందరూ అనారోగ్య సమస్యలు నడవలేని స్థితిలో ఉన్నవారిని తెలిపారు. 5908 మందికి బ్యాంకు ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు.

కౌంటింగ్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి

సమీక్షా సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 4 న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కౌంటింగ్ సెంటర్ కు మొబైల్ ఫోనులు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాట్కర్ అన్నారు. శుక్రవారం నరసరావుపేట కలెక్టరేట్ లో నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్‌లో తాగునీటి వసతి, నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాక సామాగ్రి అందుబాటులో ఉంచాలని సంబందిత సిబ్బందిని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పాటుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ సెంటర్లో హై స్పీడ్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ సిబ్బందికి బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈటిపిబిఎస్ కౌంటింగ్ కు సంబంధించి స్కానర్లతో పాటు 108 అంబులెన్స్ సర్వీస్ అందుబాటులో ఉంచాలన్నారు. మొబైల్ డిపాజిట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు

మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఈసిఐ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా లెక్కింపు చేయాలని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై విధులు కేటాయించిన అదనపు సహాయక రిటర్నింగ్ అధికారులు, వారికి సహాయకంగా నియమించిన ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గుంటూరు పార్లమెంట్

మాట్లాడుతున్న కలెక్టర్

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వ్యాలిడేషన్‌కు సంబంధించి ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సక్రమంగా సత్వరమే లెక్కింపు కోసం సహాయకంగా నియమించిన ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై శనివారం రెవెన్యూ కళ్యాణ మండపంలో మరోసారి హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు, ఐటి నోడల్ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయే పుస్తకం 'చిన్నోడికి ప్రేమతో..'

- ప్రముఖ జర్నలిస్టు వేంపల్లె షరీఫ్

ప్రజాశక్తి-తాడేపల్లి

నేటి సమాజంలో పిల్లలకు ఎక్కువ మందిలో పాఠ్యపుస్తకాల జ్ఞానం తప్ప లౌకిక జ్ఞానం ఉండటం లేదు.... తల్లిదండ్రులు కూడా ర్యాంకులు, మార్కులు తప్ప వాళ్లేమీ చూసే దశలో లేరు.... వాళ్ల పిల్లలు ఈ పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడి డబ్బు సంపాదించే యంత్రాలుగా మారుతున్న సందర్భంలో 'చిన్నోడికి ప్రేమతో..' వంటి పుస్తకం పలువురిని ఆలోచింపజేస్తుంది. ఈ పుస్తకాన్ని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి శుక్రవారం కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత, ప్రముఖ జర్నలిస్టు, పలు పత్రికల్లో వ్యాసాలు, పరిశోధనా పత్రాలు రాసిన వేంపల్లె షరీఫ్‌కు అందజేశారు. ఈ పుస్తకంపై షరీఫ్ రివ్యూ చేసి మీడియాకు తెలిపారు.

షరీఫ్‌నకు పుస్తకాన్ని అందజేస్తున్న పిన్నమనేని, సుబ్బారెడ్డి

హాస్టల్‌లో ఉన్న పిల్లాడి పట్ల ఆప్యాయతతో వారానికి ఒకటి చొప్పున ఏకంగా ఆరేళ్ల పాటు తల్లి రాసిన ఉత్తరాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారని, దీనిలోని కొన్ని విషయాలు కళ్లను తడి చేస్తాయని తెలిపారు. ఒకసారి కాకపోయినా మరోసారి ఈ విషయాల్లో కొన్నింటినైనా తమ పిల్లలకు ఏదో ఒక సందర్భంలో తాము చెబుతున్నామా అని తమను తాము ప్రశ్నించుకునేలా పుస్తకం ఉంటుందన్నారు. వృత్తిరీత్యా జహీరాబాద్‌లో వైద్యురాలైనా, ఎంత పనిలో ఉన్నా రచయిత్రి డాక్టర్ ఎ.విజయలక్ష్మి ఉత్తరాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారన్నారు. పిల్లల ఆసక్తికి, ఆలోచనకు తగ్గట్టు సరైన తర్కంతో, సందర్భానుసారం కర్తవ్య బోధ చేసే సాహిత్య సృజన లోటును ఈ పుస్తకం తీరుస్తుందన్నారు. హాయ్ చిన్నూ, హాయ్ బంగారం, హాయ్ చిన్నోడా, హాయ్ చిన్నులూ అంటూ మొదలయ్యే ఉత్తరాలన్నీ కేవలం నాలుగైదు పేరాలతో చాలా సరళమైన భాషలో, అవసరమైన పదాలతో, అవసరమైన విషయాలను, అవసరమైనంత వరకే చెప్పి ముగుస్తాయన్నారు. చివర్లో 'ప్రేమతో.. అమ్మ' అని చదవడంతోనే అక్షరాల నిండా అమ్మతనం పరుచుకుని మనసు పరిమళిస్తుందని, పుస్తకంలో రచయిత్రి కొడుకు చిన్నూకే కాదు ఎవరు చదివినా వారికి తమ అమ్మ గుర్తుకొస్తుందని చెప్పారు.

పొన్నూరు నియోజకవర్గంలో ఎండిపోయిన తమలపాకు, దొండ పందిరిని చూపిస్తున్న రైతులు

స్వల్ప జాగ్రత్తలతో ఉద్యానపంటలకు రక్షణ

- ఎండిపోయిన దొండ పందిరి
- వైరస్ తెగుళ్లు సోకి వదిలి వేసిన తమలపాకు తోటలు
- మెట్ట భూమిని రోటవేటర్తో దుక్కి చేస్తున్న ట్రాక్టర్
- ఉద్యాన రైతులు సూచనలు పాటించాలి : హార్టికల్చర్ ఆఫీసర్ ఉష

ప్రజాశక్తి -పొన్నూరు

వాణిజ్య పంటలు, పండ్లు, కూరగాయలు తోటల రైతులు వేసవిలో ఉద్యాన శాఖ అధికారుల సలహాలు ,సూచనలు పాటించి పంటల సాగులో నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పొన్నూరు హార్టికల్చర్ ఆఫీసర్ పీట ఉష బుధవారం తెలిపారు.

కూరగాయ పంటలు.. : తీగజాతి కూరగాయలు పాకడానికి పందిళ్లను వేసుకోవాలి. వేసవి దుక్కులు లోతుగా చేసుకుని నేలలో దాగి ఉన్న పురుగుల కోసస్త దశలో చనిపోయే విధంగా చేసుకోవాలి. కలుపు ఎక్కువగా ఉండే భూములలో మొదటి

సారితడి పెట్టిన తర్వాత హెక్టారుకు వెండి మిథలిన్ లేదా ఫ్లుక్లోరాలిన్ 2.5 లీటర్ల మందు ను 500 లీటర్ల నీటిలో కలిపి తేమగా ఉన్న నేలపై పిచికారి చేసి వెడల్పాటి ఆకుల కలిగిన కలుపు మొక్కలు మొలకెత్తకుండా అరికట్టాలి.

పూల తోటలు... : కొత్తగా పూల తోటలు సాగు చేయటానికి వేసవిలో లోతుగా దుక్కులు చేయాలి. గులాబీలో ఎండిన కొమ్మలను కత్తిరించి బోర్డు పేస్టు పూయాలి. వీలైనంతవరకు ఇవ్వాలి. కొత్తగా నాటిన కనకాంబరం తోటల్లో నులిపురుగుల నివారణకు కార్బో ఫిరాన్ గుళికలు ఎకరానికి 6 కిలోల చొప్పున భూమిలో వేయాలి.

తమలపాకు పంటలు.. : తమలపాకు మొదటి సంవత్సరం తోటల్లో భూమిని బాగా దున్ని దుక్కిలో ఎకరాకు 40 బండ్ల పశువుల ఎరువు,40 ల కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్ ఇచ్చే తెలుగులో వేసుకోవాలి. జీవన ఎరువులైన అజో స్పైరిలం, పాస్ఫో బ్యాక్టీరియాలను ఎకరానికి రెండు కిలోల అవిస విత్తనాలను వేసే ముందు పొలంలో చల్లుకోవాలి. హెక్టారుకు 40 నుండి 50 కిలోల అవిసె విత్తనాలను సాలుకు.. సాలుకు మధ్య ఒక్కోమీటర్ దూరంలో ఉంచి సాలులో ఒత్తుగా ఇత్తాలి. అవిస విత్తనాలను ఉత్తరం నుండి దక్షిణం దిక్కుకు మాత్రమే విత్తాలి.తొలి దశలో అవిశ మొక్కలను ఆశించిన చిత్త పురుగుల నివారణకు క్లోరో పైరిఫాస్ రెండు మిల్లీలీటర్లు లో ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. తోటలో రెండవ సంవత్సరం తోటలో వేసవిలో తోటలోనికి వేడి గాలులు రాకుండా అధిక సూర్యరశ్మి నుండి కాపాడటానికి తోట చుట్టూ దడులు కట్టాలి.

జీడిమామిడి తోటలు.. : జీడి మామిడిలో మల్చింగ్ పద్ధతి పాటించి నేల తేమ ఆవిరి కాకుండా కాపాడుకోవాలి. వర్షాధారపు జీడి తోటలు కొండ వాలులో సాగు చేస్తున్న తోటలను వాలుకు అడ్డుగా చెట్టుకు పై భాగాన కంద కాలను తొవ్వుకొని నీరు నిలిచేటట్లు చేసుకోవాలి. నీరు నిలిచే విధంగా మొక్క చుట్టూ పాదులు చేసుకోవాలి.

పసుపు తోటలు.. : పసుపు పంటకు వేసవిలో భూమిని లోతుగా దుక్కిదున్నాలి. వర్షాలకు రెండు నుంచి మూడుసార్లు మెత్తగా దుక్కి చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు, 188 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల మూటేషన్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. స్వల్పకాలిక రకాలైన కస్తూరి, సుగుణ సుదర్శన వంటి రకాలను మే నెల చివరిలో నాటుకోవాలని ఆర్టికల్చర్ ఆఫీసర్ ఉష సూచించారు. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తల శాస్త్రవేత్తల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలతో పాటు పంట అధిక దిగుబడులు సాధించాలని రైతులకు తెలియజేశారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సూపర్ బంటి పత్తి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

నూజివీడు సీడ్స్ వారి ప్రత్తిరకం సూపర్‌బంటి (ఎన్‌సిఎస్ 1122 సరఫరా తక్కువగా ఉన్నందున డీలర్లు వాటిని బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయించకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు అర్బన్ పరిధిలోని డీలర్లకు 1530 ప్యాకెట్లు అందగా, వాటిని డీలర్లు విక్రయిం చకుండా నిలుపుదల చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో శుక్రవారం రైతుల ఒరిజినల్ పాస్ పుస్తకాలు పరిశీలించి దగ్గరుండి ఎకరాకు రెండు ప్యాకెట్లు, ఒక్కొక్క పాస్ పుస్తకానికి గరిష్టంగా 5 ప్యాకెట్ల చొప్పున పంపిణీ ప్రారంభించారు. గరిష్ట చిల్లర ధరకు మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్లైసెల్ పత్తి విత్తనాల అమ్మకం నిషేధం అని ప్రతి షాపువద్ద బోర్డులు పెట్టటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు యం.సునీల్, గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, విస్తరణాధికారి ఆర్.వి.శివాజీ, వి.ఆనంద్ పాల్గొన్నారు.

తాడేపల్లిలో బిసిజి వ్యాక్సిన్

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్యంతో పాటు వివిధ సబ్ సెంటర్లలో శుక్రవారం బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన టిబి వ్యాధిగ్రస్తులు వ్యాక్సిన్‌కు అర్హులని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.శాంతకుమారి తెలిపారు. పొగతాగే అలవాటు ఉన్నవారు, ఉండాల్సిన దానికన్నా బరువు తక్కువ ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. హెచ్ఐవి ఉన్న వారితో పాటు గర్భవతులు, గుండెకు సంబంధించి వైద్య సహాయం తీసుకుంటున్న వారు, డయాలసిస్ మరియు కేన్సర్ చికిత్స పొందుతున్న వారు, మూడు నెలలకు ముందు బ్లడ్ డొనేట్ చేసిన వారు వ్యాక్సిన్‌కు అనర్హులని తెలిపారు.

శ్రీ వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ

ప్రజాశక్తి -పొన్నూరు

హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు విష్వక్షేణ పూజ, పుణ్యాహవాచనము, మన్యుసూక్త సహిత చతుర్దశ కలశ స్థపన, అలంకారములు చేశారు. లక్ష తమలపాకుల పూజ, నివేదన, నిరాజనం జరిగింది. సాయంత్రం 6 గంటలకు శ్రీ స్వామివారి ఉష్ట్ర వాహన గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహ దాతలు కనిగల్లుల కోటయ్య అండ్ సన్స్ గుంటూరు వారు ఉభయ దాతగా వ్యవహరించారు. ఆలయ ఈవో తుళ్ళి మిల్లి శ్రీనివాస్ ఉత్సవ ఏర్పాట్లను పరిరక్షించారు. హనుమత్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన ప్రముఖులను, దాతలను అర్చకులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఎయిమ్స్ ఢిల్లీ ఐఎన్ఐ-ఎస్ఎస్ పరీక్షలో డాక్టర్ వినీతకు మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-గుంటూరు :ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్- సూపర్ స్పెషాలిటీ పరీక్షలో గుంటూరుకు చెందిన డాక్టర్ కన్నెగంటి వినీత రుమటాలజీ విభాగంలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. డాక్టర్ వినీత ఎంబిబిఎస్ ఎయిమ్స్‌లో పూర్తి చేసి జనరల్ మెడిసిన్ పిజి ఛండీఘర్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో పూర్తి చేశారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు, తదితరులు

బాలలను ధూమపానం నుండి రక్షించుకోవాలి

ప్రజాశక్తి గుంటూరు :ప్రపంచ పొగాకు రహిత దినం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ప్రాంగణంలో సిబార్ దంత వైద్యశాల విద్యార్థులు, ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి, ఈ సంవత్సరం నినాదమైన 'పిల్లలను పొగాకు పరిశ్రమ జోక్యం నుంచి రక్షిద్దాం ' పై ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్. కే విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలను పొగాకు బారి నుండి రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, వారు చిన్న వయసులోనే పొగాకు త్రాగుతూ నోటి క్యాన్సర్ కు గురవుతున్నారన్నారుగురవుతున్నారన్నారు. కావున కళాశాలలు , విశ్వవిద్యాలయాలలో చదువుతున్న పిల్లలకు ధూమ పానం దుష్ప్రభావాలపై తరచుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేసినారు.జి. జి.హెచ్ సూపర్నెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ చిన్న వయసు నుంచే పిల్లలకు దురలవాట్లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వారు పొగ తాగడాన్ని ఒక ఫ్యాషన్ గా తీసుకుంటున్నారని, పొగాకు ఉత్పత్తులకు వారిని దూరంగా ఉంచాలని, సమాజంలో ఉన్న ప్రజలు కూడా పొగాకు యొక్క దుష్పరిణామాలను గురించి అవగాహన కలిగిఉండి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో సిబార్ డెంటల్ కాలేజ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ శ్రీనివాస్ , డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ప్రసాద్ , స్టేట్ లీగల్ కన్సల్టెంట్ శివ శంకర్, ఎన్సీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రావణ్ బాబు,జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ కె.వి సుబ్బరాజు, ఎన్ టి సి పి సైకాలజిస్ట్ నాగజ్యోతి పాల్గొన్నారు.

రైతులకు పూర్తి సహకారం అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా అధికారులు స్పందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బ్రాడీపేట లోని రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో డెల్టా ప్రాంతంలో మొదటిగా వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉన్న రైతంగానికి సబ్సిడీ రూపంలో జీలుగులు వెంటనే మంజూరు చేసి ఆర్‌బికె కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు వెంటనే అందించాలన్నారు. అదేవిధంగా మెట్ట ప్రాంతాలు సాగు చేసే పత్తి విత్తనాలు అధిక రేట్లను, బ్లాక్ చేసే విధానంపై అధికారులు చర్యలు తీసుకొని కంట్రోల్ చేయాలన్నారు.రైతులకు పెట్టుబడులకు అవసరమైన విధంగా బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులందరికి అందించాలని, భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించి ఎలాంటి ఎరువులు వాడాలో అవగాహన కల్పించాలన్నారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ కొరకు నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కొండవీటి వాగు వాగులో పేరుకుపోయిన తూటుకాడ వెంటనే తొలగించి, ముంపునకు గురి కాకుండా చూడాలన్నారు. భూయజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అవకతవకలుగా ఉన్న భూసర్వే ను రద్దుచేసి రైతుల సమక్షంలో గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు రీసర్వే చేసి గత పాసు పుస్తకాలను అనుసరించి సవరించాలన్నారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూసర్వే రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, రైతు ఉత్తమ అవార్డు గ్రహీత, రైతు సంఘం నాయకులు కావూరి వాసుదేవరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

పంట కాలువను బాగు చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి :ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌తో పాటు మంగళగిరి నియోజకవర్గంలోని పంట కాలువను మరమ్మతు చేసి చివరి భూములకు కూడా నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశ మోదుగులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మేకా అమరారెడ్డిభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ చిర్రావూరు గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కెఎల్ యూనివర్సిటీ గుండా వెళ్లే మెల్లెంపూడి మురుగు కాలవను మరమ్మతు చేయాల న్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో కాజ వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బుర్రముక్కు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

నాట్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరికి జాషువా విజ్ఞానకేంద్రం, ఎమ్మెల్సీ కెఎస్ ఘన సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు రాష్ట్రాల్లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంకు కుర్చీలు బహుకరించిన సందర్భంగా నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు)ను శుక్రవారం విజ్ఞాన కేంద్రంలో అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ వేలాది మంది తెలుగు వారు విదేశాల్లో స్థిరపడ్డారని, కానీ మూలాలు మర్చిపోకుండా సొంత నేల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నాట్స్ కృషి అభినందనీయం అన్నారు. పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి, మహిళలకు కుట్టు మిషన్లు, కర్నూలులో వైద్య శిబిరాల ద్వారా విజ్ఞాన కేంద్రాలకు సహాయ పడుతున్నారన్నారు. చెంచుల కోసం ఆర్‌డిటితో కలిసి శిక్షణ కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ పెదనంది పాడులో అతి సాధారణ కుటుంబంలో జన్మించి, కష్టపడి చదివి అమెరికా వెళ్లి ఈ ప్రాంతం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్న బాపు సేవా దృక్పదం అభినందనీయం అన్నారు. రూపాయికి పది రూపాయలు ఎలా సంపాదించాలని ఆలోచిస్తున్న ఈ రోజుల్లో ఇటువంటి సేవా గుణం కలిగిన వారు అరుదుగా ఉన్నారన్నారు. బాపు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రాలను రాబోయే రోజుల్లో యువత, మహిళల అభివృద్ధికి అనుగుణంగా తీర్చిదిద్దాలని, తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అమెరికాలో, రెండు తెలుగు రాష్ట్రాల్లో నాట్స్ చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలను వివరించారు. ఐలు జాతీయ కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాట్స్ న్యాయపరమైన అంశాల్లోనూ పని చేయాలని, అందుకు ఐలు సహకారం అందిస్తుందని సూచించారు. అనంతరం నూతి బాపును ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పాశం రామారావు, తదితరులు శాలువా, బొకేతో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


బాపయ్యచౌదరిని సత్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, రామారావు తదితరులు

రేపు వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి బైపాస్‌రోడ్డు అమరావతి ఐకాన్‌లో నిర్వహించిన 22 రోజులు బాలల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్ వద్ద జరుగుతుందని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి తెలిపారు. వేసవి శిబిరంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జరిగే సభలో రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రావి శారద, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్టుమెంట్స్ అసోసియేషన్ తాడేపల్లి అధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు, బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి ఐకాన్ మిత్ర బృందం యడ్ల బాలకృష్ణ పాల్గొంటారని తెలిపారు. సభానంతరం వేసవి శిక్షణలో నేర్చుకున్న నృత్యాలు ప్రదర్శింపబడతాయని చెప్పారు. వివిధ అపార్టుమెంట్లలో ముఖ్యులను కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల తల్లిదండ్రులు, అపార్టుమెంట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కౌంటింగ్ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అవగాహన సదస్సులో పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ కేష్ లత్కర్, ఎస్పి మల్లిక గార్గ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోలీస్ మరియు రెవెన్యూ శాఖ సంయుక్తంగా సమన్వయంతో పనిచేసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్.హెచ్.ఓలు, రిటర్నింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులతో కౌంటింగ్ పై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా సంఘట జరిగితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని నిర్లక్ష్యం వీడి భాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. అలసత్వం వహించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ రోజున జరిగిన పలు సంఘటనల వలన పల్నాడు జిల్లా మిగిలిన జిల్లాల కన్నా ప్రాచుర్యం పొందిందన్నారు. సమన్వయంతో ఫలితాలతో సంబంధం లేకుండా తటస్థంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ పోలీస్ శాఖ అభ్యర్థులతో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎన్నికల ప్రక్రియలో కేసులు నమోదు అయితే అవి త్వరిత గతిన పరిష్కారం కావని తెలియచేయాలని సూచించారు. ఏ విషయం పైన అయినా వెంటనే స్పందించి వేగంగా పరిష్కరించేలా ఉండాలన్నారు. ఫలితాల అనంతరం అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించిన విషయాలు వెంటనే మీడియాకు అందచేయాలని తెలిపారు. బైన్డోవర్ కేసులపై యాక్షన్ తీసుకోవాలన్నారు. రోడ్లపై రాళ్ళు, కర్రలు లేకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, కూడళ్ళలో భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఎస్.పి మల్లిక గర్గ్ మాట్లాడుతూ బైన్డోవర్ కేసులపై తక్షణ చర్యలు తీసుకొని నగదు చెల్లించని వారిని అరెస్ట్ చేయాలని ఈ నెల 3వ తేదీరాత్రి నుండి ఫలితాలు విడుదల అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి బైన్డోవర్ చేయాలన్నారు. పరారీలో ఉన్న వారిని జిల్లాలోకి అనుమతించ వద్దని లూజ్ పెట్రోల్ మరియు బాణాసంచాలకు అనుమతి లేదని, పోలీస్, రెవెన్యూ శాఖ సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ మండల స్థాయి నుండి డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి వరకు సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు. లూజ్ పెట్రోల్ మరియు బాణా సంచాలకు అనుమతి లేదని తెలిపారు. గుంపులు గుంపులను ఉండకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్, వేదికపైన ఎస్‌పి, జెసి తదితరులు